
లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో పూజలో పాల్గొన్న మహిళా భక్తులు


సంతపేట సాయిబాబా ఆలయంలో భక్తుల సామూహిక పారాయణ


చీమకుర్తిలో పూజలు చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు


మంగమూరు రోడ్డులోని అచలానంద ఆశ్రమంలో పూజ చేస్తున్న అచలానందస్వామి

- భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా మందిరాలు
- విశేష అలంకరణలో దర్శనమిచ్చిన షిరిడీ సాయినాథుడు
- విద్యుత్ కాంతులతో మందిరాలు

ఒంగోలు మెట్రో: గురుపౌర్ణమి మహోత్సవాన్ని ఆదివారం ఒంగోలు నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని షిరిడీ సాయిబాబా మందిరాలు, అచలానంద ఆశ్రమం, భగవాన్ సత్యసాయిబాబా దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు, సామూహిక నామ సంకీర్తనలు, కోలాట ప్రదర్శనలు వైభవంగా నిర్వహించారు. స్థానిక లాయరుపేట షిరిడీ సాయిబాబా మందిరంలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో, కర్నూలు రోడ్డులోని సాయిబాబా మందిరంలో, పేర్నమిట్ట బాబా మందిరంలో, కొప్పోలు షిరిడీ సాయిబాబా మందిరంలో, త్రోవగుంట బాబా మందిరంలో, మంగమూరు రోడ్డులోని శివసాయి క్షేత్రం, అచలానంద ఆశ్రమంలో గురుపౌర్ణమి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం ఐదు గంటలకు కాకడ హారతి, ఆరు గంటలకు సాయిబాబాకు మంగళస్నానం, ఉదయం 11 గంటలకు అన్నసంతర్పణ, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం ఆరు గంటలకు ఆచార్య భరద్వాజ మాస్టర్‌కి సామూహిక మల్లెల పూజ, రాత్రి ఏడు గంటలకు సాయిబాబాకి పూలంగి సేవ నిర్వహించారు. కర్నూలు రోడ్డు సాయిబాబా మందిరంలో ఉదయం ఏడు గంటలకు క్షీరాభిషేకాలు, సామూహిక గురు చరిత్ర పారాయణం, సంధ్యా హారతి, పల్లకి సేవ, కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.


కర్నూలు రోడ్డు సాయిబాబా ఆలయంలో సామూహిక సత్యసాయి వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు


చీమకుర్తి: గురుపౌర్ణమి వేడుకలను చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని పలు సాయిబాబా మందిరాలలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు సాయిబాబా మందిరంలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. చీమకుర్తి హరిహరక్షేత్రంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు సకల దేవతలను పూజించారు. చండీహోమంలో పాల్గొన్నారు. చీమకుర్తి రచ్చమిట్ట సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని పలు సాయిబాబా మందిరాలలో భక్తులు గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీల సభ్యులు ఉదయం నుంచే బాబాను భక్తులు దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించడంతో పాటు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయిబాబా మందిరాలలో కమిటీల సభ్యులు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో బాబా మందిరాలు మార్మోగాయి.


చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు


అన్నదానం చేస్తున్న మారం వెంకారెడ్డి


సంతపేట సాయిబాబా ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు


సంతపేట సాయిబాబా మందిరంలో బాబా దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ


లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

చీమకుర్తి: ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆర్యవైశ్య సంఘం, వాసవీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విజయకుమార్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధితో పాటు గ్రానైట్ పరిశ్రమను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తొలుత వాసవీ అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శిద్దా సుధీర్, లయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

కొత్తపట్నం: మదర్ థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద కుటుంబాల పిల్లలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కొత్తపట్నం మండలంలోని పలు ప్రాంతాల్లో ఆకలితో అలమటిస్తున్న పిల్లలను గుర్తించి భోజన ప్యాకెట్లు, బిస్కెట్లు, కూల్‌డ్రింక్స్ అందజేశారు. బెంగళూరు పెద్దదాసు మొదటి వర్ధంతి సందర్భంగా అతని కుమారుడు వేణు వాటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

పుల్లలచెరువు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ ఫిరోజ్ ఫాతిమా తెలిపారు. పుల్లలచెరువు, శతకోడు, ఐటీవరం గ్రామాల్లో మెరుపుదాడులు చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాటాడుతుండగా, అదుపులోకి తీసుకున్న వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం: స్థానిక శ్రీపార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తజనుల హరిహర ధ్వానాల మధ్య ఆదివారం వైభవంగా జరిగింది. త్రిపురాంతకస్వామి ఆలయ కుమారగిరి ప్రదక్షిణను ఆషాఢ పౌర్ణమి సందర్భంగా భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు ఆశీర్వచనం అందించారు.

నాంచారమ్మ వైభవం చూతమురారండి!


కొత్తపట్నంలో కొలువుదీరిన శ్రీ నాంచారమ్మతల్లి


నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం (ఫైల్ ఫొటో)

- కొత్తపట్నంలో ఈ నెల 24 నుంచి నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలు
- ఐదేళ్లకు ఒకసారి 6 రోజుల పాటు అట్టహాసంగా నిర్వహణ
- 25 లక్షల నుంచి 30 లక్షల మంది వరకూ హాజరుకానున్న భక్తులు
- ఇతర రాష్ట్రాల నుంచి సైతం రాక


బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన అమ్మవారి ఆలయం

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామ దేవత శ్రీ నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీ నుంచి వైభవంగా జరగనున్నాయి. ఐదేళ్లకోసారి ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు సుమారు 25 లక్షల నుంచి 30 లక్షల మంది వరకూ భక్తులు హాజరవుతారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివస్తారు. నిత్యం నాంచారమ్మను పూజించే గ్రామస్తులు బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నెల రోజులకుపైగా నాంచారమ్మ తల్లి ఘటాన్ని గ్రామాల్లో తిప్పుతున్నారు. ఘటం ప్రారంభించిన 45 రోజుల తర్వాత బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. 1324వ సంవత్సరంలో 700 సంవత్సరాల క్రితం నాంచారమ్మతల్లి విగ్రహాన్ని గ్రామంలో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చి భక్తుల కొంగుబంగారంగా నాంచారమ్మ అమ్మవారు ప్రసిద్ధి చెందారు. కొత్తపట్నం గ్రామస్తులు ఏ పని చేయాలన్నా ముందుగా ఆలయంలో పూజలు చేయించుకుంటారు. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో స్థిరపడిన వారు సైతం బంధుమిత్రులతో బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. అధిక మొత్తంలో విరాళాలు కూడా అందిస్తారు. సంతానం లేని వారు బ్రహ్మోత్సవాల్లో అమ్మవారి ముందు వరపడతారు. వరపడిన తర్వాత ఎంతోమందికి సంతానప్రాప్తి కలిగిందని పూర్వీకుల నుంచి చెబుతుంటారు.

బ్రహ్మోత్సవాల షెడ్యూల్...

నాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాలతో భాగంగా ఈ నెల 24న కలశ స్థాపన, కుంకుమపూజ, రాత్రికి పులి వాహనంపై గ్రామోత్సవం, ఆలయ ప్రాంగణంలో కొత్తపట్నం శంభునిరెడ్డిపాలెం వారిచే బొబ్బిలిరాయుడు సాంఘిక నాటకం, భారీగా మందు చెట్లు పేల్చడం జరుగుతాయి. 25న పగలు సింహవాహనంపై శ్రీ నాంచామర్మ తల్లి ఉత్సవం, రాత్రికి కొత్తపట్నం శంభునిరెడ్డిపాలెం వారిచే పులిబిడ్డలు సాంఘిక నాటకం ప్రదర్శిస్తారు. 26న పగలు గజవ్యాళి వాహనంపై, రాత్రి చిన్న ఏనుగు వాహనంపై నాంచారమ్మతల్లి గ్రామోత్సవం జరుగుతుంది. అదే రోజు మూడు భారీ విద్యుత్ ప్రభలు, రాక్‌స్టార్ ఈవెంట్స్, ఒంగోలు వారిచే గొప్ప డ్యాన్స్ ప్రదర్శన, స్వరసుమాంజలి ఒంగోలు వారిచే గొప్ప పాటకచేరి, చింతామణి నాటక ప్రదర్శనలు ఉంటాయి. 27న పగలు గుర్రం వాహనంపై, రాత్రికి పెద్ద ఏనుగు వాహనంపై నాంచారమ్మ తల్లి గ్రామోత్సవం ఉంటుంది. అదే రోజు రేణుకా యుద్ధం, మూడు భారీ విద్యుత్ ప్రభలు, ఎల్‌ఈడీ ప్రభలు, జయశ్రీ ఈవెంట్స్ డ్యాన్స్ ప్రదర్శన, రాత్రి 10 గంటలకు 200 మందు చెట్లతో బాణసంచా పేల్చి పోటీలో గెలిపొందిన వారికి రూ.50 వేల నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుంది. ఈ నెల 28న పొంగళ్లు, పసుపు బండ్లు, శిరిమానోత్సవం, రాత్రికి స్నేహం కోసం సాంఘిక నాటకం ప్రదర్శనలు ఉంటాయి. 29న చివరి రోజు పగలు శ్రీ గంగాదేవి అమ్మవారికి తల్లిపాటు జరుగుతుంది. ఆరు రోజులు జరిగే తిరునాళ్లలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి వైభవాన్ని కనులారా తిలకించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

- వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో కార్యాచరణ
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్రశిక్ష
- ఎస్‌ఈపీ ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలు

పుల్లలచెరువు:

నేటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంఈవో శామ్యూల్‌జాన్ తెలిపారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సమగ్రశిక్ష అధికారుల ఆదేశాల మేరకు ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులను అధిక సంఖ్యలో భాగస్వాములను చేయాలని సూచించారు. వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారని అన్నారు. దేశంలో కొత్తగా జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్న దానిపై డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఎన్‌ఈపీ–2020ని ప్రవేశపెట్టారని, అప్పటి వరకు ఉన్న 10+2+3 విద్యా విధానాన్ని రద్దు చేసి 5+3+3+4 విద్యా విధానాన్ని అమలు చేశారని తెలిపారు. కొత్త విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శిక్షా సప్తాహ్ వేడుకలను వారం రోజుల పాటు జరపాలని ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. వేడుకలను మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు.

వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలివే...

ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ వేడుకల్లో భాగంగా 22న స్థానికంగా లభించే వనరులను ఆసరాగా చేసుకుని అభ్యసనా సామగ్రి తయారు చేయడం, తయారు చేసిన సామగ్రిని పరిశీలించడానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలను ఆహ్వానించి వారి ప్రశంసలు పొందడం జరుగుతుంది. 23న పునాది అభ్యసన కార్యక్రమంలో భాగంగా 1వ తరగతి నుంచి భాషపై విద్యార్థులు మంచి నైపుణ్యం సాధించేలా చేయడం, గణితంలోని సంఖ్యా శాస్త్రంపై పట్టుసాధించేందుకు చర్చల ద్వారా అవగాహన కల్పించడం, 24న వివిధ క్రీడలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించడం, పోటీల ద్వారా వారిలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడం, శారీరక సౌష్ఠవం ప్రాముఖ్యతను వివరించడం, 25న భిన్నత్వంలో ఏకత్వం భావనను విద్యార్థుల్లో పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, ప్రధానంగా క్లాసికల్, ఫ్యాన్సీ డ్రస్‌లు, నృత్య ప్రదర్శనలు, పాటల పోటీలు, నాటిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా విద్యలో సాంకేతికాభివృద్ధిని గుర్తించేలా చర్చలు జరపడం, ఉద్యోగ అవకాశాలు, తరగతి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తరగతి గదుల సౌకర్యాలను మెరుగుపరచుకుని డిజిటల్ విద్య కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాలను గుర్తించడం జరుగుతాయి. 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మిషన్ లైఫ్ యాక్టివిటీస్, న్యూట్రిషన్ డే, కొత్తగా ఎకో క్లబ్‌ల ఏర్పాటు, అమ్మకు అంకితం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లులతో కలిసి మొక్కలు నాటడం, మాతృభూమి మధ్య బంధం పెంచడానికి ప్రతి పాఠశాలలో తల్లీబిడ్డలతో కలిసి 335 మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవంలో భాగంగా చివరి రోజు ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఉపాధ్యాయ సంఘాల సహకారంతో వివిధ కార్యక్రమాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తారు. పుల్లలచెరువు మండలంలోని ప్రతి పాఠశాలలో హెచ్‌ఎంలు తప్పనిసరిగా ఈ కార్యక్రమాలను వారం రోజుల పాటు నిర్వహించాలని ఎంఈవో ఆదేశించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు


పెద్దదోర్నాలలోని పీర్లచావిడి వద్ద ఊరేగుతున్న పీర్లు

పెద్దదోర్నాల: మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో ఆదివారంతో మొహర్రం వేడుకలు ముగిసాయి. వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శనివారం పెద్దషరగత్‌ను వైభవంగా నిర్వహించిన మండల ప్రజలు.. ఆదివారం మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని పీర్ల చావిడి వద్ద భారీ అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. కులమతాలకతీతంగా నిర్వహించుకునే మొహర్రం వేడుకల్లో ప్రజలు భారీగా పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పీర్లకు ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించి సంప్రదాయంగా నీటిలో అవనతనం చేశారు. పర్వదినం సందర్భంగా కొందరు వేసుకున్న విచిత్ర వేషధారణలు మండల ప్రజలను ఆకట్టుకున్నాయి. మండల పరిధిలోని యడవల్లి, చిన్నగుడిపాడు, రామచంద్రకోట తదితర గ్రామాల్లో సైతం మొహర్రం వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామస్తులు పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు చిట్యాల వెంకటేశ్వరరెడ్డి చిన్నగుడిపాడులో జరిగిన మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు.

75 మందికి కళ్లద్దాల పంపిణీ

ఒంగోలు అర్బన్: సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో తెనాలి నేత్రాలయ ఐ కేర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి కంటి లోపాలున్న 75 మంది పేదలకు సుమారు రూ.50 వేల విలువచేసే కళ్లద్దాలను ఆదివారం ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేయడం, శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరుగుతోందని ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ఐ కేర్ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సర్దార్‌బాషా, మారెళ్ల సుబ్బారావు, శ్రీనివాసరావు, సుభానీ తదితరులు పాల్గొన్నారు.


కళ్లద్దాలు అందజేస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు